# కాలమ్ దాటని కథ

రాధాకృష్ణ నాకు సహోద్యోగి. నా కన్న చిన్నవాడు. వృద్ధిలోకి రావలసినవాడు ఒక రోజున లంచ్ విరామ సమయంలో మా యిద్దరి మధ్య యీ విధంగా సంభాషణ కొనసాగింది :

"పరీక్షలకు బాగా చదువుతున్నారా?"— నా పరామర్శ.

"లేదండీ. బాగా సాగటల్లేదు."

"ఎందుకని?"—కారణం లేకుండాకార్యం వుండదని ఎక్కడో చదివిన గుర్తు.




"ఏమోనండి. మొత్తం మీద తృప్తిగా వుండటల్లేదు"

"అయితే ఒక పని చేయండి"-కొంచెం గంభీరంగా అన్నాను. నేను యివ్వబోయే సలహాకు రాధాకృష్ణ విస్ఫారిత నేత్రాలతో నావైపు తలెత్తి చూశాడు-ఏమిటి అన్నట్టు.

"ఫ్యామిలీ యిచ్చటేవుందా?"

"ఏమిటి అలా అడుగుతున్నారు?"

"మరేంలేదు, ఫ్యామిలీ యిచ్చటేవుంటే వెంటనే పుట్టింటికి పంపండి. పుట్టింటి వద్ద వుంటే వెంటనే తీసుకొచ్చెయ్యండి. చదువు ఎలా సాగదో చూస్తాను "

ఒక్కక్షణం ఆశ్చర్యంగా చూసి, పకపకా నవ్వాడు రాధాకృష్ణ

ఆ సంవత్సరం రాధాకృష్ణ పరీక్ష ప్యాసయాడని నేను చెప్పటం మర్చిపోతే-ఈకథ అసంపూర్ణంగానే మిగిలిపోతుంది.

—దేవినేని జగన్మోహనరావు

# సమాచారమ్

రాజాం (శ్రీకాకుళం జిల్లా) ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇటీవల జరిగిన "చేతన" సాహితీ మిత్ర సమాఖ్య ద్వితీయ వార్షికోత్సవంలో ముఖ్యఅతిథులుగా శ్రీ రోణంకి అప్పలస్వామి, శ్రీ చాగంటి సోమయాజులు, శ్రీ పి.వి. రమణయ్య పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ పి మురళీధర్ అధ్యక్షత వహించారు. శ్రీ బి వి.ఎ రామారావు నాయుడు "చేతన" కార్యక్రమాల నివేదిక సమర్పించారు. శ్రీ ఎ. ఎస్.



చేతన సాహితీ మిత్ర సమాఖ్య కార్యక్రమంలో ప్రసంగిస్తున్న శ్రీ రోణంకి అప్పలస్వామి, ప్రక్కన శ్రీ పి వి రమణయ్య.

నరసింహారావు శ్రీ రోణంకిని శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీరోణంకిఅప్పలస్వామిప్రసంగిస్తూ విజ్ఞానాభివృద్ధికి ఇంగ్లీషు చాలా అవసరమని, ఆంగ్ల సాహిత్య ప్రభావంవల్ల తెలుగులో ప్రేమ కవిత్వం వచ్చిందని, ప్రతిపదార్థానికి దొరకనిది, అనుభవాన్ని మాత్రమే కలిగించేది సింబాలిజమని, తెలుగులో కవిత్వం వ్రాయబడిన తర్వాతే దానిలోని సింబల్స్ని ఎంచుకొని వాటినే తెలుగులో సింబాలిజం అన్నారని పేర్కొన్నారు. తెలుగు రచయిత నన్నయనాటి నుంచిగల కవిత్వాన్ని చదవాలని, విస్తృత చైతన్యం కలిగి వుండాలని, విప్లవ కవిత్వం శ్రీశ్రీతో చనిపోయిందని వ్రాస్తామన్నవాళ్ళు ఇంకొక మలుపు తిరగాలని ఆయన అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాలలో వాడుతున్న తెలుగు పదాలకంటె ఇంగ్లీషు పదాలే సామాన్యులకు అర్థమవుతున్నాయని, కనుక ఇంగ్లీషు పదాలనే అటువంటి చోట్ల వాడాలని ఆయన పేర్కొన్నారు.

శ్రీ చాగంటి సోమయాజులు మాట్లాడుతూ ఖండకావ్యానికి ఏనాడూ తెలుగులో గౌరవం లేదన్నారు. తెలుగులోను, పాశ్చాత్య భాషలలోను కూడా వచనం ఆధునికమైనదే నన్నారు. భాష ప్రవాహం వంటిదని, భాషననుసరించి అలంకార శాస్త్రం తయారవుతుంది కాని అలంకారశాస్త్రాన్ని ననుసరించి సాహిత్యం తయారు కాదని చెప్పారు.

శ్రీ పి.వి. రమణయ్య మాట్లాడుతూ ఇంగ్లీషు వాతావరణపరిస్థితులకుఅనుగుణంగా తయారైన సింబాలిజం, ఇమేజిజం మొదలయిన పద్ధతులు తెలుగుకు జీర్ణంకాని విషయాలుగా మిగిలిపోయాయన్నారు. చేతన నుంచి పదార్థావిర్భావం పదార్థం నుంచి చేతనా విర్భావం. అని కవులలో రెండు రకాల అభిప్రాయాలు కలవారు వున్నారని ఆయన పేర్కొన్నారు. సగం అలంకార శాస్త్రం, సగం పాశ్చాత్య సౌందర్య శాస్త్రం కలిపినవారు అనుభూతివాదులని, వీరు కొన్నాళ్ళకు ఈ వాదం నుంచి గెంతేస్తారని; తెలుగు కవిత్వంలో నారాయణబాబు, కథకు చా. సో., నవలకు బుచ్చిబాబు గొప్పవారని ఆయన పేర్కొన్నారు.

అధ్యక్షుని ముగింపులో రోణంకివారి ఉపన్యాసాన్ని సమీక్షిస్తూ ఆయన భావానికి, నారాయణబాబు కవిత్వానికి చాలా సన్నిహితత్వం వున్నదన్నారు. శ్రీ గార రంగనాథం స్వాగతం పలకడంతో ప్రారంభమైన కార్యక్రమం శ్రీ దామెర వెంకటరావు వందన సమర్పణతో ముగిసింది. ★